సాక్షి

నారాయణపేట

సోమవారం, 6, మే, 2024



మోసం చేస్తున్న కాంగ్రెస్

మాదిగలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందని ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు.

వివరాలు IIలో ▸



అన్నివర్గాలకు మేలు

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు మేలు జరుగుతుందని ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు.

వివరాలు IIలో ▸

గరిష్టం/కనిష్టం
44.9 /25.7

వాతావరణం

ఉదయం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతోపాటు ఉక్కపోత ఉంటుంది. మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

నర్వ: బీడి కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నర్వ, లంకాల్ బీడీ ఫ్యాక్టరీల వద్ద కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. గత మూడు దఫాలుగా బీడీ ఫ్యాక్టరీల యాజమాన్యాలతో జరిగిన చర్చల్లో ప్రస్తుతం వెయ్యి బీడీలకు అందిస్తున్న రూ.207కు మరో రూ.10మాత్రమే యాజమాన్యాలు పెంచుతామనడం అన్యాయమన్నారు. కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్న యాజమాన్యాలు వేతన పెంపును పునారాలోచించాలన్నారు. దీంతో పాటు పీఎఫ్ వాటా 50 శాతం జమచేయాలని, గ్రాట్యుటీ చట్ట ప్రకారం అమలు చేయాలని, పీఎఫ్‌లో ఉన్న తప్పొప్పులను వెంటనే సవరించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో బీడీ వర్కర్స్ యూనియన్ వనపర్తి జిల్లా సహాయ కార్యదర్శి రాజు, నాయకులు మన్యం, తిరుపతమ్మ, కృష్ణమ్మ, వెంకటమ్మ, చెన్నమ్మ, భాగ్య, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

నారాయణపేట రూరల్: జిల్లాలో వరుస చోరీల నేపథ్యంలో ప్రజలు, వ్యాపారస్తులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ యోగేష్‌గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దొంగతనాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు బాధ్యతగా కలిసిరావాలని, మీ చుట్టు పక్కల ఎవరైన కొత్త వ్యక్తులు, అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. జిల్లాలో పూర్తి స్థాయి పెట్రోలింగ్ జరగుతుందని, ప్రత్యేక పోలీసు బృందాలు మఫ్తీలో గస్తీ చేపడుతున్నారని, వేసవి దృష్ట్యా బంధువుల ఇళ్లకు, విహారయాత్రలకు వెళ్లే సమయంలో ఇంట్లో విలువైన వస్తువులు, నగదు ఉంచకుండా బ్యాంకు లాకర్లలో దాచుకోవాలని సూచించారు. తాళం వేసిన ఇళ్లను దొంగలు లక్ష్యం చేసే అవకాశం ఉన్నందున పక్కింటి వారికి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. వీలైనంత వరకు కాలనీ కమిటీలు, వ్యాపార సముదాయాల వారు సహకరించి సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని తెలిపారు.

మహిళల అభ్యున్నతికి పెద్ద పీట



నారాయణపేట: దేశంలోనే అన్ని రంగాల్లో మహిళలకు 33 శాతంతో పార్లమెంట్‌లో బిల్లు పెట్టి మహిళల అభ్యున్నతికి పెద్ద పీట వేసింది మోదీ ప్రభుత్వం అని ఆ పార్టీ మహిళా మోర్చ అధ్యక్షురాలు లక్షిచ్మ అన్నారు. ఆదివారం మండలంలోని లింగంపల్లిలో పాలమూరు పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డికే అరుణ తరపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పేద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లతోపాటు మరుగుదొడ్లు, రేషన్ బియ్యం మంజూరు చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనని వివరించారు. దేశామంత మరో సారి మోదీని పీఎం చేయాలనే చూస్తుందని, ఈ ఎన్నికల్లో హాట్రిక్ పీఎం మోదీ ఖావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాంతానికి చెందిన ధన్వాడ ఆడబిడ్డ అరుణను గెలిపించాలని, ఈ ప్రాంతానికి కావాల్సిన అభివృద్ధి పనులు చేసేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. గ్రామ శివారులో ఉపాధి పనుల్లోని మహిళ కూలీలకు మజ్జిగ అందజేశారు. సుజాత, భీంష న్ జోషి. రాందాస్ నాయక్, కృష్ణ, ఎన్ ఎల్లప్ప, రాజు. విజయ్. వెంకటేష్. ఎల్లాగౌడ్. కార్యకర్తలు మహిళ లు పాల్గొన్నారు.

మరోసారి బీజేపీదే అధికారం

కల్వకుర్తి రూరల్: దేశంలో బీజేపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వచ్చి తీరుతుందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ అన్నారు. ఆదివారం సాయంత్రం కల్వకుర్తిలో కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి మురుగన్‌తో కలిసి కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట శక్తికేంద్ర ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో భరత్ ప్రసాద్ విజయం ఖాయమన్నారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లకు అప్పగించిన బాధ్యతలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. తమ పరిధిలోకి వచ్చే ప్రతి ఓటరును కలిసి ఈ పదేళ్లలో కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో జరిగిన అభివృద్ధిని వివరించి ఓట్లు అడగాలన్నారు. ప్రతి కార్యకర్త ఎన్నికల వరకు కష్టపడి పనిచేసి బీజేపీ విజయం కోసం శ్రమించాలని సంతోష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీ రాములు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, బంగారు శ్రుతి, మాజీ ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సభావేదికపై గాడిద గుడ్డు చూపిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి మల్లు రవి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ తదితరులు



అభివాదం చేస్తున్న రాహుల్‌గాంధీ

కాంగ్రెస్‌లో జోష్..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/అలంపూర్:

వరుసగా కొత్తకోట, ఎర్రవల్లిలో జనజాతర సభలు

- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు
- అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగానికి విశేష స్పందన
- పాలమూరుకు ఏం చేస్తారో వివరిస్తూనే ప్రత్యర్థులపై విమర్శనాస్త్రాలు

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి పాలమూరులో కాంగ్రెస్ అగ్రనేతల వరుస పర్యటనలతో ఆ పార్టీలో జోష్ నెలకొంది. కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా శనివారం కొత్తకోటలో రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరైన విషయం తెలిసిందే. తాజాగా ఆదివారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని గద్వాల జిల్లా ఎర్రవల్లి చౌరస్తాలో నిర్వహించిన జనజాతర బహిరంగ సభకు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఈ క్రమంలో నేతలు పాలమూరుకు ఏం చేస్తారో వివరిస్తూనే ప్రత్యర్థులపై విమర్శనాస్త్రాలు సంధించడం.. సభలకు భారీ ఎత్తున ప్రజలు తరలిరావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం తొణికిసలాడుతోంది. ఎర్రవల్లి చౌరస్తాలో జరిగిన సభలో నాయకులు ఏమన్నారో వారి మాటల్లోనే..

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

“నేను భారత్ జోడోయాత్రలో నాలుగు వేల కిలోమీటర్లు నడిచాను. బీజేపీ దేశంలో మతవిద్వేషాలు రేకెత్తించింది. మనుషుల మధ్య చిచ్చుపెట్టింది. మేము విద్వేషాల బజారులో ప్రేమ దుకాణం తెరిచాం. విద్వేషాలతో ఏమీ రావు.. ప్రేమతో దేశం ముందుకెళ్తుంది. పేదల ప్రభుత్వం, రైతుల ప్రభుత్వం, బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. మోదీ ధనవంతుల కోసం సర్కారును నడుపుతాడు. దాని వల్ల దేశానికి మేలు జరగదు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలి.

\- రాహుల్ గాంధీ, ఏఐసీసీ అగ్రనేత

ఆశీర్వదించాలి..

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సీఎం రేవంత్ రెడ్డి ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వస్తే రాహుల్‌గాంధీ ఐదు గ్యారంటీలు అందిస్తారు. కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటే ప్రతి ఇంటికి 11 పథకాలు వస్తాయి. ప్రజలు తమ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కేంద్రంలో పేదల ప్రభుత్వం ఎన్నుకునేలా కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలి.

\- మల్లు రవి, నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి

పదేళ్లు దోచుకున్న బీఆర్ఎస్..



పదేళ్ల రాష్ట్ర సంపదను బీఆర్ఎస్ నాయకులు దోచుకున్నారు. సాగు, తాగునీటి కోసం పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే పదేళ్లలో ఇదే పాలమూరు జిల్లాకు కృష్ణానది నుంచి అదనంగా ఒక చుక్క నీరు కూడా బీఆర్ఎస్ నాయకత్వం తీసుకురాలేకపోయింది. జూరాల, శ్రీశైలం, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్‌తో పాటు నిన్నటికి నిన్న మొదలుపెట్టిన జూరాల నుంచి కొడంగల్ ఎత్తిపోతల పథకం ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సాధ్యమయ్యాయి.

\- మల్లు భట్టివిక్రమార్క, డిప్యూటీ సీఎం

జనజాతర సభలో పాల్గొన్న వారు..

ఎర్రవల్లి చౌరస్తాలో జరిగిన సభకు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, కార్యదర్శి రోహిత్ చౌదరి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, రాజేష్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ సరిత, యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అండగా ఉండాలి..

నడిగడ్డలోని బంగ్లా రాజకీయాలు అందరికీ తెలుసు. పొద్దున చెరొకవైపు ఉన్న వారు.. రాత్రయ్యేసరికి ఒకచోటికి చేరుతారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీఆర్ఎస్, బీజేపీ ఒకటయ్యాయి. అదే బంగ్లా రాజకీయం ఈ ప్రాంతంలో నడుస్తోంది. అదే బంగ్లా రాజకీయానికి గుణపాఠం చెప్పి శాశ్వతంగా సమాధి కట్టాలి. కృష్ణా, తుంగభద్ర నది మధ్యలో ఉన్న నడిగడ్డ పౌరుషానికి, పోరాటానికి పెట్టింది పేరు. నడిగడ్డ బిడ్డలు ఎవరికైన మాట ఇస్తే తల తెగి కిందపడ్డా సరే ఆ మాట నుంచి ఒక్క అడుగు వెనుకేయరు. ఎన్ని కష్టాలు వచ్చినా ఇచ్చిన మాట కోసం నిలబడతారు. 70 ఏళ్ల తర్వాత మన పాలమూరుకు తెలంగాణకు నాయకత్వం వహించే అవకాశం వచ్చింది. మన ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు ప్రధానంగా గట్టు, తుమ్మిళ్ల, ఆర్డీఎస్ ఆధునికీకరణ, ఎర్రవల్లి చౌరస్తా నుంచి రాయచూరు వరకు నాలుగు లైన్లు, పాలమూరు–రంగారెడ్డి పూర్తి చేసుకోవడానికి మీరందరూ కాంగ్రెస్‌కు అండగా ఉండాలి. నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవిని గెలిపించాలి. మీరందరూ డిసెంబర్‌లో కేసీఆర్‌ను ఓడించి పని అయిపోయిందని అనుకుంటున్నారు. డిసెంబర్‌లో జరిగిన ఎన్నికలు సెమీఫైనల్స్. ఈ నెల 13న ఫైనల్స్ తెలంగాణ వర్సెస్ గుజరాత్ మధ్య జరుగుతున్నాయి. గుజరాత్‌ను ఓడించి తెలంగాణను గెలిపించుకుందాం.

\- రేవంత్‌రెడ్డి, ముఖ్యమంత్రి

దేశాన్ని సంఘటిత శక్తిగా మలిచారు..

రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్రలో నాలుగు వేల కిలోమీటర్లు నడిచి.. దేశాన్ని సంఘటిత శక్తిగా మలిచారు. దేశానికే దిక్సూచిగా ఆయన నిలిచారు. ఇందిరాగాంధీ, సోనియాగాంధీది త్యాగాల కుటుంబం. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన ఘనత సోనియాదే. పాలమూరు సమస్యలు పరిష్కారం కావాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి.

\- జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి



జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి చౌరస్తాలో జనజాతర సభకు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు

జనజాతర సభ సైడ్‌లైట్స్

- సాయంత్రం 4.42 గంటలకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక హెలీకాప్టర్‌లో పదో బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు.
- 4.48 గంటలకు ప్రత్యేక కాన్వాయ్‌లో సభా ప్రాంగణానికి బయల్దేరారు.
- 5 గంటలకు రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి సభావేదికపైకి చేరుకున్నారు.
- ముందుగా ఎంపీ అభ్యర్థి మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, మంత్రి జూపల్లి కృష్ణారావు, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించిన తర్వాత చివరలో రాహుల్‌గాంధీ మాట్లాడారు.
- రాహుల్‌గాంధీ ప్రసంగం 5.50 గంటలకు ముగిసింది.
- హెలీకాప్టర్‌లో 5.55 గంటలకు రాహుల్‌గాంధీ తిరిగి వెళ్లిపోయారు.
- జై కాంగ్రెస్ అని గట్టిగా నినదిస్తే బంగ్లాలో గుండెలు దద్దరిల్లాలని సీఎం రేవంత్‌రెడ్డి కార్యకర్తలను ఉత్తేజపరిచారు.

\- అలంపూర్ /ఎర్రవల్లి చౌరస్తా/ మానవపాడు/ ఉండవెల్లి

ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారులదే కీలక పాత్ర

నారాయణపేట: ప్రజాస్వామ్య విలువలు కాపాడటానికి ఎన్నికలను పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించడంలో ప్రిసైడింగ్ అధికారులదే కీలక పాత్ర అని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ తర్వాత కేటాయించిన పీఓలు, ఏపీఓలకు ఎన్నికల నిర్వహణ, ఈవీఎంలపై జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ రోజున పాటించాల్సిన బాధ్యతలు, చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈవీఎంల నిర్వహణలో, వివిధ రకాల ఫారాలు నింపడంలో చిన్న అనుమానం వచ్చినా ఇక్కడే మాస్టర్ ట్రైనర్ ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజున మాత్రం ఒక్క తప్పు జరగడానికి వీలు లేదన్నారు. పీఓ డైరీని బాగా చదవాలని, పోలింగ్ రోజున ప్రిసైడింగ్ అధికారి అక్కడి పోలింగ్ స్టేషన్‌కు సుప్రీం బాస్‌గా ఉంటారని వారి అధికారాలను తెలియజేశారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు విధుల్లో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు వస్తె సెక్టోరియల్ అధికారులకు తెలియజేసి సహాయం పొందాలన్నారు. ప్రిసైడింగ్, ఏపీఓ అధికారులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈవీఎంలను ఎలా అనుసంధానం చేయాలో ఒకటికి రెండు సార్లు ఇక్కడే చూసుకోవాలని తెలిపారు. కలెక్టర్‌తో పాటు ఆర్డీఓ మధుమోహన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




పోస్టల్ ఓటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పోస్టల్ ఓటింగ్ జాగ్రత్తగా నిర్వహించాలి

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రి సైడింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద గల సాంఘిక సంక్షేమ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రంలోని పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ రిజిస్ట్రేషన్, ఓటర్స్ రిజిస్ట్రేషన్ రిజిస్టర్లను,ఓటింగ్ సరళిని అదనపు కలెక్టర్ మయాంక్‌మిత్తల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు వేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును ఉద్యోగులందరూ ఈనెల 8వరకు వినియోగించుకోవాలని సూచించారు.

ఖర్చులపై నజర్..



- నామినేషన్ దాఖలు నుంచి ఫలితాల వరకు ఖర్చుల లెక్కింపు
- వివరాలను బిల్లులతో సహా అప్పగించాల్సిందే
- పరిమితి దాటితే అనర్హత వేటే..

నాగర్‌కర్నూల్: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ప్రచార ఖర్చుపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. ఎన్నికల సంఘం అభ్యర్థుల వ్యయ పరిమితిని రూ.95లక్షలుగా నిర్ణయించింది. నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఫలితాలు వచ్చే వరకు ఖర్చు వివరాలను ఈసీ నియమించిన పరిశీలకులు లెక్కిస్తారు. అభ్యర్థి తన ఎన్నికల ప్రచారం కోసం వెచ్చిస్తున్న డబ్బుకు నిబంధనలకు అనుగుణంగా లెక్కించాలి. సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రకటనలు, వాల్ పోస్టర్లు, వాహనాలకు సంబంధించిన వ్యయాన్ని నమోదు చేయాల్సి ఉంటుంది.

ధరలకు అనుగుణంగా ఖర్చు..

మార్కెట్ ధరలు ఎప్పటికప్పుడు పెరుగుతున్న నేపథ్యంలో ఖర్చులను అంచనా వేయడానికి ధరల ద్రవ్యో ల్బణ సూచిని ఎన్నికల కమిషన్ ప్రామాణికంగా తీసుకుంటుంది. అభ్యర్థి ఏదైనా ప్రాంతీయ బ్యాంకు ఖాతా తెరిచి దాని ద్వారా లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన 30 రోజుల లోపు అభ్యర్థులు తమ ఖర్చు వివరాలను బిల్లులతో సహా అధికారులకు అప్పగించాల్సి ఉంటుంది. లేదంటే అభ్యర్థిపై అనర్హత వేటు పడుతుంది.

పక్కాగా పరిశీలన..

సాధారణంగా ఎన్నికలంటే విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లి ఓటర్లను మభ్యపెడుతూ తమ వైపు తిప్పుకునేందుకు నాయకులు శతవిధాల ప్రయత్నం చేస్తుంటారు. అయితే ఈ అప్రజాస్వామ్యాన్ని అరికట్టేందుకు, ఎన్నికల్లో పారదర్శకత ఉండేందుకు ఎన్నికల కమిషన్ ఖర్చులపై నిబంధన విధించింది. ప్రతి రోజు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎక్కడెక్కడ ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ప్రచారంలో భాగంగా ఎన్ని నిధులు ఖర్చు చేస్తున్నారనే దానిపై ఎప్పటికప్పుడు ఈసీ వ్యయ పరిశీలనతో పాటు కేంద్రం, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, నిఘా బృందాలు, వీడియో సర్వేలైన్స్ బందాలు సమాచారాన్ని సేకరిస్తాయి. అభ్యర్థుల ఖర్చులను పరిశీలించేందుకు ఆడిట్ బృందాలను ఏర్పాటు చేశారు. ఆయా పార్టీల అభ్యర్థులు నిర్వహించే సభలతోపాటు ర్యాలీలు, రోడ్‌షోలలో ఖర్చు చేసే కుర్చీల నుంచి భోజనం, టీ, కాఫీ వరకు అంతా లెక్కిస్తారు. అభ్యర్థుల ఖర్చు వివరాలపై పరిమితి ఉన్నా ప్రస్తుత ఎన్నికల్లో ఖర్చులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చేస్తున్నారా లేదా అనే విషయంపై ఎన్నో అనుమానాలు ఉన్నాయి.

వివరాలు చెప్పాల్సిందే..

ఎన్నికల్లో పోటీ చేసే పార్లమెంట్ అభ్యర్థులు నిబంధనల ప్రకారం రూ.95 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఖర్చులకు సంబంధించి అన్ని వివరాలు ఎన్నికల కమిషన్‌కు చెప్పాల్సి ఉంటుంది. మించి ఖర్చు చేస్తు అనర్హత వేటు పడుతుంది. ఎన్నికలు పూర్తయిన 30 రోజుల్లో వివరాలను సమర్పించాలి.

\- సంతోష్‌రావు, ఎక్స్‌పెండేచర్ అబ్జర్వర్ నోడల్ ఆఫీసర్

కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దు



మందిపల్లి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

హామీల అమలులో విఫలం

ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన పార్టీగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోతుందని మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి అన్నారు. మరికల్ మండలంలోని మాధవరం, పెద్దచింతకుంటల్లో ఆదివారం ఆయన రోడ్‌షో నిర్వహించారు.

ధన్వాడ/మరికల్: ప్రస్తుతం వరి కొనుగోళ్లు లేక గత ప్రభుత్వం అందించే పథకాలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇది కాలం తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్ ప్రభుత్వం తిసుకొచ్చిన కరువు అని, మరోసారి వారి మాయమాటలు నమ్మొద్దని మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ధన్వాడలోని మందిపల్లిలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మన్నె శ్రీనివాస్ రెడ్డి తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజల చెవిలో పూలు పెట్టారని, ఇప్పుడు దేవుడి మీద ఒట్టు, అన్ని పథకాలు అమలు చేస్తామని మళ్లీ మాకు ఓటు వేయండంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిస్తున్నారని, ప్రజలు వారి మాయమాటలు నమ్మకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో తీసుకువచ్చిన పథకాలను గుర్తించి ఓటు వేసి గెలిపించాలని అన్నారు. ఇక బీజేపీకి ఓటు వేస్తే ముందుగా వారు చేసేది రైతుల పొలాల వద్ద మిటర్లు బిగిస్తారని అన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు కాంచిరెడ్డి, లక్ష్మి నారాయణ, మాధవరెడ్డి, మాదవులు, రాఘవేందర్‌రెడ్డి, సంజప్ప, నర్సిములుతో పాటు పలువురు గ్రామస్తులు బీఆర్ఎస్ పార్టీలో చేశారు.

హజ్‌యాత్రికులకు వ్యాక్సినేషన్



వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

నారాయణపేట రూరల్: హజ్‌యాత్రకు వెళ్తున్న ముస్లింలకు ఆదివారం జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ శైలజ మాట్లాడుతూ.. యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకునే క్రమంలో ఎలాంటి అనారోగ్య సమస్యలు ఎదురుకాకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మెడికల్ వాక్సినేషన్ చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యబృందం డాక్టర్ కార్తిక్, డాక్టర్ బాలాజి, హజ్ కమిటి నాయకులు అమిరోద్దిన్, ఉస్మాన్, వైద్య సిబ్బంది గోవిందరాజు, శ్రీనివాస్‌రెడ్డి, స్నేహ, విజయ్‌కుమార్, ప్రహ్లాద్, అమీనా, శివశేషమ్మ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


బాలపీరు(ఫైల్)

పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ దేవతను దర్శించుకోడానికి మొగలి బాలపీర్(30) తన మోటార్ సైకిల్‌పై మైసమ్మ దేవత వద్దకు వెళ్తుండగా.. దేవల్‌తిరుమలాపూర్ గ్రామ సమీపంలోని ఊరగుట్ట వద్ద మోటార్ సైకిల్‌ను గుర్తు తెలియని బొలెరో వాహనం ఢీకొట్టింది. మొగలి బాలపీరు రోడ్డుపై పడి అక్కడికక్కడ మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మొగలి బాలపీరు దేవల్‌తిరుమలాపూర్ గ్రామం నుంచి నాయినోనిపల్లి మైసమ్మ దేవత వద్దకు వెళ్తుండగా.. పెద్దకొత్తపల్లి నుంచి వనపర్తికి వెళ్తున్న గుర్తు తెలియని బొలెరో వాహనం బాలపీర్ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో మృతిచెందాడు. మైసమ్మ దేవత వద్దకు వెళ్తున్న భక్తులు రోడ్డుపై పడి ఉన్న మృతదేహాన్ని చూసి దేవల్‌తిరుమలాపూర్ గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా.. ఆ గ్రామస్తులు వచ్చి చనిపోయిన వ్యక్తిని మొగలు బాలపీర్‌గా గుర్తించారు. మృతుడి భార్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు పెద్దకొత్తపల్లి ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేయించి, మృతుడి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్ఐ తెలియజేశారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ అక్బర్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని తిమ్మసానిపల్లి శివారులో శనివారం అర్ధరాత్రి తర్వాత గుర్తుతెలియని వ్యక్తి(40) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వాహనంపై నుంచి పడి యువకుడు మృతి

ఉప్పునుంతల: వాహనం పైనుంచి ప్రమాదవశాత్తు కింద పడి యువకుడు చెందాడు. వివరాలు ఇలా.. మండలంలోని వెల్టూరులో ఆదివారం ఉదయం ఎద్దులను వాహనంలో ఎక్కిస్తుండగా ప్రమాదవశాత్తు తాడు తెగిపోయి పై నుంచి కింద పడిన వాహన యజమాని, డ్రైవర్ ఈరట్వానిపల్లికి చెందిన సబావట్ గణేష్ (27) తలకు, మేడపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతన్ని అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. వెల్టూరుకు చెందిన గంట రాములు ఎద్దులను వేరే చోటుకు తీసుకెళ్లడానికి వాహనం అద్దెకు వచ్చిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నవ వరుడు దుర్మరణం


నగేష్ (ఫైల్)

తెలకపల్లి: పెళ్లి జరిగిన రెండు నెలలకే ఓ నవ వరుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. ఈ విషాదకర ఘటనకు సంబంధించి ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం.. మండలంలోని పెద్దూరు గ్రామానికి చెందిన కోళ్ల నగేష్(30)కు రెండు నెలల క్రితమే ఓ యువతితో వివాహం జరిగింది. అయితే ఆదివారం సాయంత్రం తన ద్విచక్రవాహనంపై తెలకపల్లికి వెళ్తుండగా గౌరెడ్డిపల్లి శివారులో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నగేష్‌కు తీవ్రగాయాలు కాగా.. కారు బోల్తాపడి లక్నారం గ్రామానికి చెందిన భగవంతురావు స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు తీవ్రంగా గాయపడిన నగేష్‌ను నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. నగేష్ మృతితో గ్రామంలో, కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై నగేష్ చిన్నాన్న బిచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మూడోసారి మోదీ సర్కారే..

కేంద్ర సమాచార, ప్రసార, పాడిపరిశ్రమశాఖ మంత్రి ఎల్.మురుగన్


అచ్చంపేటలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ఎల్.మురుగన్.. చిత్రంలో ఎంపీ రాములు తదితరులు

కొల్లాపూర్/అచ్చంపేట: కేంద్రంలో మూడోసారి మోదీ సర్కారు కొలువుదీరనుందని కేంద్ర సమాచార, ప్రసార, పాడిపరిశ్రమ, మత్స్యశాఖ మంత్రి ఎల్.మురుగన్ అన్నారు. ఆదివారం కొల్లాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశానికి, అచ్చంపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన గిరిజన మోర్చా ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓటేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని.. దేశాభివృద్ధి, రక్షణ, మహిళా సాధికారత మోదీతోనే సాధ్యమన్నారు. పీఎం ఆవాస్ యోజన, జల్‌జీవన్ మిషన్, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, మరుగుదొడ్ల నిర్మాణం, పీఎం సమ్మాన్‌నిధి వంటి ఎన్నో పథకాలు ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపర్చాయని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా మత్స్యశాఖకు మంత్రిని నియమించలేదని.. బీజేపీ సర్కారు ఆ పనిచేసిందని, మత్స్యకారుల సంక్షేమానికి రూ.38,500 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. 500 ఏళ్లుగా ఉన్న అయోధ్య రామమందిర నిర్మాణం సమస్యకు ముగింపు పలికారని, దేశం గర్వించేలా రామ మందిరం నిర్మించారని తెలిపారు. గిరిజన సమాజంతో బీజేపీకి అవినాభావ సంబంధం ఉందని, గిరిజనుల స్థితిగతులు కేంద్ర ప్రయత్నం తీసుకున్న నిర్ణయాలు వారికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. భారత రాష్ట్రపతిగా గిరిజన బిడ్డకు అవకాశం కల్పించిన ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. తెలంగాణకు గిరిజన యూనివర్సిటీ ఇచ్చిందని చెప్పారు. కాంగ్రెస్‌పార్టీ ఓటమి భయంతో రాజ్యాంగం మారుస్తారని, రిజర్వేషన్లు రద్దు చేస్తారని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా బీజేపీ గెలిచే సీట్లలో నాగర్‌కర్నూల్ కూడా ఉందని.. ఇక్కడ విజయం ఖాయమైందని, ఎంపీ రాములు ప్రజల మంచికోరే వ్యక్తి కావడంతో ఆయన కుమారుడు, బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మోదీ ఆశీస్సులు ఉన్నాయని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 167కే జాతీయ రహదారి, సోమశిల సమీపంలో కృష్ణానదిపై రూ.2,400 కోట్లతో ఐకానిక్ వంతెన పనులు పూర్తి చేస్తామని చెప్పారు. కొల్లాపూర్‌లో మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుచేసి మామిడి ఎగుమతులకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. కొల్లాపూర్‌లో జరిగిన సమావేశంలో నాయకులు శేఖర్‌గౌడ్, సందు రమేష్, భరత్‌చంద్ర, రోజారమణి, సాయికృష్ణగౌడ్, జగ్గారి శ్రీధర్‌రెడ్డి, భీమేష్, కద్దాల కృష్ణ, కాశీపురం మహేష్, అచ్చంపేటలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ పోతుగంటి రాములు, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి, తెలంగాణ అభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ నరేందర్‌రావు, పార్టీ జాతీయ నాయకులు మంగ్యానాయక్, మండికారి బాలజీ, రేణయ్య, గణేష్‌మోడీ, పత్యానాయక్, చందూలాల్ చౌహాన్, సైదులు యాదవ్, జానకి, కౌన్సిలర్ సుగుణమ్మ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

కోస్గి కార్నర్ మీటింగ్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి


కోస్గి రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి

కోస్గి: పోరాడి సాధించుకున్న తెలంగాణలో సంక్షేమ పాలన అందించిన ఘనత కేసీఆర్‌దేనని పాలమూర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మాయ మాటలతో అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఆదివారం రాత్రి స్థానిక శివాజీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రోడ్డు కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోని పాలమూర్ ప్రాజెక్టుతో పాటు ఏ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వకుండా అభివృద్ధికి ఏ మాత్రం సహకరించలేదన్నారు. పాలమూర్‌లో ఓట్లు అడిగే హక్కు అటు బీజేపీకి, ఇటు ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీలకు లేదన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎంతో సంతోషంగా ఉన్న అన్ని వర్గాల ప్రజలు.. కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలోనే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించాలంటే బీఆర్ఎస్‌కు ఓటేసి గెలిపిస్తే కాంగ్రెస్ మెడలు వంచి హామీలు అమలు చేయిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కోస్గి సభలో రేవంత్‌రెడ్డి అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. ఎంపీ ఎన్నికల్లో ప్రజలు రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. జిల్లాలో పోటీ కేవలం బీఆర్ఎస్, బీజేపీల మధ్యనే ఉందన్నారు. మూడో స్థానంలో ఉన్న కాంగ్రెస్‌ను చూసి రేవంత్‌రెడ్డి మండలాల వారీగా పర్యటిస్తున్నారన్నారు. అంతకు ముందు పట్టణంలోని రామాలయం చౌరస్తా నుంచి శివాజీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి వ్యాపారులను కలిశారు. కారు గుర్తుకు ఓటేయాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ స్పోర్ట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, వెంకట్‌నర్సింహులు, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐదు నెలలైనా ఒక్కటీ నెరవేర్చలే..


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

శాంతినగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలైనా ఆరు గ్యారంటీలు అమలు చేయలేదని, ప్రజలు అర్థం చేసుకుని బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. వడ్డేపల్లి, రాజోళి మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయకులు, కారకర్తల సమావేశం స్థానిక భవాని పంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు హాజరై బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఎన్నికలకు సమయం దగ్గర పడిందని, కేవలం వారం రోజులు మాత్రమే ఉన్నందున సోమవారం నుంచి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఓటర్లను కలిసి బీఆర్ఎస్ చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. శాసనసభ ఎన్నికల్లో నియోజకవర్గంలో ఎమ్మెల్యే విజయుడుకు 30 వేల మెజార్టీ ఇచ్చారని, అదే స్ఫూర్తితో కష్టపడి నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌కు 50 వేల మెజార్టీ ఇవ్వాలని పిలుపునిచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి బస్సులు తగ్గించి, హామీకి తూట్లు పొడిచారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సమయానికి అన్ని నిధులు వచ్చేవని, కాంగ్రెస్ హయాంలో ఇప్పటి వరకు ఏ హామీలు అమలు కాలేదన్నారు. ఎమ్మెల్యే విజయుడు మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు అత్యధిక మెజార్టీ ఇచ్చి గెలిపించి, కేసీఆర్‌కు గిఫ్ట్‌గా ఇద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసులు, ఎంపీపీ రజిత, వైస్ ఎంపీపీ చంద్రగౌడ్, రాజోళి వైస్ ఎంపీపీ రేణుక, మున్సిపల్ చైర్మన్ కరుణ, పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, పుల్లూరు నాగేశ్వర్‌రెడ్డి, వావిలాల రంగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రాహుల్ పేరు చెబితే ఓట్లు పడవు'


మాజీ ఎంపీపీ సంజీవరెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

గండేడ్/ మహమ్మదాబాద్: బీజేపీ తెలంగాణకు చేసింది గాడిద గుడ్డే తప్ప ఏమీ లేదని కాంగ్రెస్ నాయకులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పార్టీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నంచర్ల గేట్ వద్ద ప్రచార, చేరికల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాహుల్‌గాంధీ పేరు చెప్పి గ్రామాల్లోకి వెళ్తే ఓట్లు పడవని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీల పేరుతో తెలంగాణలో కాంగ్రెస్ ఆరు గుడ్లు పెట్టి ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. ధనిక రాష్ట్రాన్ని దరిద్ర రాష్ట్రంగా మార్చారని, దీనికి కారణమైన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఎస్సీలను బీజేపీ ఆదుకుంటే కాంగ్రెస్ ఓట్ల కోసం వాడుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలతోనే ఈ రోజు గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. పూట గడవని పరిస్థితుల్లో పేదలకు ఉచిత బియ్యం పంపిణీ చేసి పేదల కడుపు నింపుతున్న ఘనత మోదీదే అన్నారు. దేశరక్షణ, దేశ సమగ్రతను కాపాడడంతోపాటు భారత్‌ను అగ్రదేశాల సరసన నిలబెట్టడం కేవలం నరేంద్రమోదీకే సాధ్యమవుతుందన్నారు. రెండు పైసలు రుణమాఫీ చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండు ఓట్లు కూడా రావని, తాము 2 లక్షల మెజార్టీతో గెలవడం, మోదీ మళ్లీ ప్రధాని కావడం ఖాయం అని పేర్కొన్నారు. అంతకు ముందు గండేడ్ మాజీ ఎంపీపీ సంజీవరెడ్డి, పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ మెంబర్, మెదక్ జిల్లా ఇన్‌చార్జ్ గిరమోని శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిట్ట పరమేశ్వర్, ప్రహ్లాద రావు, ఓబీసీ ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప, కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి తిరుపతిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ కొమిరె లక్ష్మయ్య, జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏటా కోటి ఉద్యోగాల భర్తీ ఏమైంది?


బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ రూరల్: ఏటా కోటి ఉద్యోగాల భర్తీ అంటూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ.. పదేళ్లు గడిచినా నేటికీ ఆ హామీ నెరవేర్చలేదని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తన నివాసంలో సీపీఐ ఆధ్వర్యంలో ముద్రించిన అవినీతి ఊబిలో కూరుకుపోయిన బీజేపీ అనే పుస్తకాన్ని ఆయన విడుదల చేసి మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థలను అప్పనంగా కార్పొరేట్లకు అమ్మేశారని, నల్లధనాన్ని తెస్తానన్న మోదీ ఇంతవరకు ఆ జాడే లేదన్నారు. 2004కు ముందు రూ.420 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ఇప్పుడు రూ.1,200 చేరిందని తెలిపారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ మాట్లాడుతూ.. వందేళ్ల కిందట పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా విభజించి కార్మికుల భవిష్యత్‌ను అంధకారం చేసిందని ఆరోపించారు. 138 సంవత్సరాల కిందట ఉన్న 12 గంటల పని విధానాన్ని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లి ప్రవేశపెట్టేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ సర్కార్‌కు స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు.

అంబులెన్స్ బోల్తా : నలుగురికి గాయాలు

మహబూబ్‌నగర్ క్రైం: నవజాత శిశువు ఆరోగ్యం బాగాలేకపోవడంతో నారాయణపేట నుంచి అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్‌కు వస్తున్న క్రమంలో డ్రైవర్ నిద్ర మత్తులో కల్వర్టుకు ఢీకొట్టడంతో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడిన క్షతగాత్రులలో నవజాత శిశువు కూడా ఉంది. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరగిద్ద మండల దోరేపల్లికి చెందిన కవితకు 40రోజుల కిందట ప్రసవం అయితే ఆడ శిశువు జన్మించింది. అయితే శిశువు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఈనెల 2న నారాయణపేట ఆస్పత్రిలో చికిత్స కోసం చేరారు. ఈ క్రమంలో మెరుగైన చికిత్స కోసం ఆదివారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్‌కు వస్తుంటే మార్గమధ్యలో డ్రైవర్ నిద్రమత్తులో ధర్మపూర్ సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టడంతో అంబులెన్స్‌లో ఉన్న కవిత, నవజాత శిశువు, కవిత తల్లి వెంకటమ్మ, అంబులెన్స్ హెల్పర్ శ్రీనివాస్‌కు గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారందరిని చికిత్స కోసం హైదరాబాద్ రెఫర్ చేశారు. బాధిత కుటుంబ సభ్యుడు నర్సప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు సముచిత న్యాయం

ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి


ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని గజమాలతో సత్కరిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

మక్తల్: ఇందిరమ్మ రాజ్యంలో అన్నివర్గాలకు సముచిత న్యాయం దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో మైనార్టీ, కుర్వ కులస్తులు, ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాల్లో ఆయనతో పాటు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60 లక్షల ముదిరాజ్ జనాభా ఉందని, వారిని బీసీ–డి నుంచి బీసీ–ఏలోకి, గొల్ల కుర్వలు, యాదవులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గొల్ల కుర్వలకు రాయితీ గొర్రెలు అందజేస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని.. ఆ డబ్బులను తిరిగి ఇప్పించే ప్రయత్నం చేస్తానని చెప్పారు. తనను ఎంపీగా గెలిపిస్తే రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని తెలిపారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించారని, పార్లమెంట్ ఎన్నికల్లోనూ అలాగే పనిచేసి వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. అనంతరం పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు పట్టణ అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. అనంతరం కార్యకర్తలు వారిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, బీకేఆర్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు కోళ్ల వెంకటేష్, గోపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గణేష్‌కుమార్, నాయకులు ఆనంద్‌గౌడ్, రాజప్పగౌడ్, చెన్నయ్యసాగర్, గంగాధర్‌గౌడ్, కావలి తాయప్ప, విఘ్నేశ్వర్‌రెడ్డి, రవి కుమార్, ఆంజనేయులుగౌడ్, మాజీ ఉపసర్పంచ్ కట్ట సురేష్, కావలి శ్రీహరి, వెంకటేష్, నూరోద్దీన్, చంద్రకాంత్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో రేవంత్ విఫలం

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ


మిడ్జిల్ బీజేపీ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డీకే అరుణ

జడ్చర్ల టౌన్/ మిడ్జిల్/ రాజాపూర్: తెలంగాణలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయడంలో రేవంత్ సర్కార్ విఫలమైందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ ఆరోపించారు. ఆదివారం ఆమె జడ్చర్ల పట్టణంతోపాటు రాజాపూర్, మిడ్జిల్, ఊర్కొండ మండలాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారం, కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అమలు కాని హామీలు ఇచ్చి మోసం చేస్తున్నారని, ఇప్పుడు ఎన్నికల కోడ్ ఉందని ప్రమాణాలు చేస్తున్నారని విమర్శించారు. మోదీ నాయకత్వంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి రావడం చూసి కొత్త కాంగ్రెస్ పార్టీ కొత్త నాటకాలతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు గ్రామాల్లో తిరుగుతున్నారని అన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యం అవుతుందన్నారు. రైతుబంధు లేదని, రైతు రుణమాఫీ లేదని, మహిళలకు నెలకు ఖాతాలో రూ.2,500 జమ లేదని విమర్శించారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం..

బీజేపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని అందుకే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో తనను మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా గెలిపించాలని డీకే అరుణ పిలుపునిచ్చారు. జడ్చర్ల మున్సిపాలిటీలో నిర్వహించిన రోడ్‌షో క్రాస్‌రోడ్డు నుంచి నేతాజీ చౌరస్తా వరకు కొనసాగింది. మోదీ గురించి మాట్లాడే నైతిక హక్కు రేవంత్‌రెడ్డికి లేదన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో దేశంలోని పేదరికాన్ని బీజేపీ దూరం చేసిందని అన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేశాకే కాంగ్రెస్ ప్రజలను ఓట్లు అడగాలన్నారు. దేశ భద్రత కోసం నరేంద్రమోదీని మళ్లీ ప్రధాని చేయాలని పిలుపునిచ్చారు. రాజాపూర్ మండలంలోని గ్రామాలకు చెందిన పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు.

మాదిగలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ


అచ్చంపేటలో డప్పుకొడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, గువ్వల బాలరాజు తదితరులు

అచ్చంపేట రూరల్/ఉప్పునుంతల: రాష్ట్రంలో 80లక్షలకు పైగా ఉన్న మాదిగలకు ఒక్క ఎంపీ సీటు కూడా ఇవ్వకుండా మాదిగలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం అచ్చంపేట పట్టణంలోని ఫంక్షన్‌హాలులో మాదిగ రాజకీయ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మాదిగల ఆత్మగౌరవ సభను నిర్వహించారు. అదేవిధంగా ఉప్పునుంతలలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓట్లు వేయడానికి మాదిగలు కావాలి కానీ, ఎంపీ సీట్లు ఇవ్వరా? అని ప్రశ్నించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాదిగలకు బీఆర్ఎస్ సముచిత స్థానం కల్పించిందన్నారు. కేంద్రంలో బీజేపీ చేస్తున్న మత రాజకీయాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. చరిత్ర తిరగ రాయాలన్నా.. చరిత్ర సృష్టించాలన్నా మాదిగలకే సాధ్యమన్నారు. అధికారం అడ్డుపెట్టుకుని రూ.వేల కోట్లు సంపాదించిన నాగర్ కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఎంతోమంది స్వార్థపరులు పదవులను అనుభవించి బీఆర్ఎస్‌ను వీడితే.. తాను మాత్రం కేసీఆర్ నికార్సయిన పాలనకోసం, పేద ప్రజల సంక్షేమం కోరి బీఆర్ఎస్‌లోకి వచ్చానని ప్రవీణ్ కుమార్ తెలిపారు. తాను గురుకుల పాఠశాల సెక్రటరీగా ఉన్న సమయంలో పేద విద్యార్థులను ఎంతోమందిని ఉన్నత స్థితికి తీసుకెళ్లానన్నారు. ప్రస్తుత ఎంపీ రాములు రాజకీయ లబ్ధి కోసం బీజేపీలో చేరి తన కుమారుడి అధికారం కోసం తహతహలాడుతున్నాడే తప్పా ఈ ప్రాంత అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. నవీన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, గోపాల్‌రెడ్డి, రవీందర్‌రావు, భాస్కర్, శంకర్, విజయ్, వెంకటయ్య, రవీందర్, సురేష్ పాల్గొన్నారు.

నగదు సీజ్ చేసిన పోలీసులు


బాలానగర్‌లో సీజ్ చేసిన నగదుతో పోలీసులు

బాలానగర్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులో ఆదివారం నగదును పోలీసులు సీజ్ చేశారు. మండలంలోని పెద్దరేవల్లికి చెందిన మణికంఠగౌడ్ వద్ద రూ.7 లక్షల నగదు లభించిందని ఎస్ఐ తిరుపాజీ తెలిపారు.

అమరచింత: మస్తీపురం ఎక్స్‌రోడ్ వద్ద ఆదివారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా దారం మల్లేష్ నుంచి రూ.52వేల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సురేష్ కుమార్ తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికలు బహిష్కరిస్తాం..

అమరరాజా బ్యాటరీ కంపెనీ ఏర్పాటుపై ఎదిర వాసుల నిర్ణయం


మాట్లాడుతున్న అమరరాజా పరిశ్రమ వ్యతిరేక కమిటీ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ రూరల్: కాలుష్య కారకమైన అమరరాజా బ్యాటరీ కంపెనీ ఏర్పాటుకు నిరసనగా మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు (ఎదిర) ప్రజలు పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ బహిష్కరణకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. సుమారు 56 రోజులపాటు అమరరాజా బ్యాటరీ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరాహార దీక్ష చేసినా ఎవరూ స్పందించకపోవడంతో విసిగివేసారిన వార్డు ప్రజలు పార్టీలకు అతీతంగా ఎన్నికల బహిష్కరణకు ఆదివారం తీర్మానం చేశారు. ఈ సందర్భంగా నిరాహార దీక్షా శిబిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అమర రాజా పరిశ్రమ వ్యతిరేక కమిటీ ప్రతినిధులైన వార్డు కౌన్సిలర్ యాదమ్మ, మాజీ కౌన్సిలర్ శివశంకర్, మొగిలి నర్సింహులు మాట్లాడుతూ అమరరాజా బ్యాటరీ కంపెనీ కాలుష్య కారకమైనదని, ఆ కంపెనీ ఏర్పాటు చేయడం వార్డు ప్రజలకు ఇష్టం లేదన్నారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యేకు విన్నవించినా పట్టించుకోకపోవడం వల్లే ఓటింగ్ బహిష్కరణకు నిర్ణయించుకున్నామని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తాము ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో పాల్గొనబోమని, అంతేకాక తమ వారసుల భవిష్యత్ కోసం చుట్టుపక్కల గ్రామాల వారికి అవగాహన కల్పిస్తామని, వారు కూడా ఓటింగ్‌లో పాల్గొనకుండా చూస్తామన్నారు.

పోస్టల్ బ్యాలెట్ బహిష్కరించిన దివ్యాంగురాలు

ఎదిర వార్డు ప్రజల నిర్ణయం మేరకు దివ్యాంగురాలు వసంత పార్లమెంట్ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ ఓటును బహిష్కరించింది. ఓటు ఫర్ హోం కార్యక్రమంలో ఆదివారం ఓటు వేయమని ఆమె వద్దకు వచ్చిన ఎన్నికల సిబ్బందికి తాను ఓటు వేయనని తేల్చి చెప్పింది. వార్డు ప్రజలందరూ ఒకే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని, వారు ఓటింగ్ బహిష్కరణకు తీర్మానం చేసినందుకు తాను కూడా ఓటు వేయనని చెప్పారు. కార్యక్రమంలో బండారి శ్రీనివాసులు, నర్సింహులు, మోహన్‌కుమార్, రవికుమార్, రాఘవేందర్, శివకుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాహుబలుల బరి!

మామాజీ, దిగ్గీ రాజా, సింధియాల గురి | **మధ్యప్రదేశ్‌లో 9 చోట్ల 7న పోలింగ్** | **అన్నీ కమలనాథుల సిట్టింగ్ స్థానాలే** | **ఈసారి కొన్నింట కాంగ్రెస్ గట్టి పోటీ**

వారిద్దరూ మాజీ సీఎంలు. ఒకరు రాష్ట్రంలో, మరొకరు కేంద్రంలోనూ చక్రం తిప్పిన ఉద్దండులు. సుదీర్ఘకాలం తర్వాత లోక్‌సభ బరిలో దిగారు. వీరికి తోడు కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా. ఇలా పలువురు కీలకమైన నేతల పోటీకి మధ్యప్రదేశ్‌లో మూడో విడత ఎన్నికలు వేదికగా మారాయి. రాష్ట్రంలోని 9 లోక్‌సభ స్థానాలకు 7న పోలింగ్ జరగనుంది. 2019 ఎన్నికల్లో వీటన్నింటిలోనూ కమలమే విరబూసింది. ఈసారి పలు స్థానాల్లో కాంగ్రెస్ గట్టి పోటీయే ఇస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని కీలక స్థానాలపై ఫోకస్...

– సాక్షి, నేషనల్ డెస్క్



విదిశ

మధ్యప్రదేశ్‌కు సుదీర్ఘకాలం సీఎంగా ఉన్న బీజేపీ దిగ్గజం శివరాజ్‌సింగ్ చౌహాన్ లోక్‌సభ బాట పట్టారు. విదిశ ఓటర్లకు ఆయన కొత్తేమీ కాదు. 1996, 1998, 1999, 2004 ఎన్నికల్లో ఇక్కడి నుంచి వరుసగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. మొత్తమ్మీద ఇక్కడి నుంచి ఐదుసార్లు గెలిచారు. నియోజకవర్గ ప్రజలు చౌహాన్‌ను ఆప్యాయంగా మామాజీ అని పిలుచుకుంటారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రతాప్ భాను శర్మతో పోలిస్తే ఆయనకే విజయావకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. 1991లో వాజ్‌పేయినీ లోక్‌సభకు పంపిన చరిత్ర విదిశకు ఉంది. 2009, 2014 ఎన్నికల్లో బీజేపీ దిగ్గజం సుష్మా స్వరాజ్ కూడా ఇక్కడి నుంచి గెలిచారు.

రాజ్‌గఢ్

మాజీ సీఎం, కాంగ్రెస్ కీలక నేత దిగ్విజయ్ సింగ్ పోటీలో ఉండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇక్కడి ప్రజలు గత రెండు ఎన్నికలుగా బీజేపీనే గెలిపిస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లోనూ బీజేపీ నుంచి రోడ్మల్ నాగర్ ఇక్కడ బంపర్ మెజారిటీతో విజయం సాధించారు. 2014లో 2.28 లక్షల మెజారిటీ సాధించగా 2019లో 4.31 లక్షలకు పెంచుకున్నారు. ఈసారీ బీజేపీ నుంచి ఆయనే బరిలో ఉన్నారు. అభిమానులు దిగ్గీ రాజా అని పిలుచుకునే దిగ్విజయ్ ఏకంగా 30 ఏళ్ల తర్వాత ఇక్కడ పోటీకి దిగుతుండటం విశేషం. ఆయన సోదరుడు లక్ష్మణ్ సింగ్ ఇక్కడ ఐదుసార్లు గెలిచారు లక్ష్మణ్ సింగ్ 2004లో బీజేపీ టికెట్‌పైనా గెలవడం విశేషం!

వీటికి ఎన్నిక

మొరేనా, భిండ్, గ్వాలియర్, గుణ, సాగర్, విదిశ, భోపాల్, రాజ్‌గఢ్, బేతూల్ (ఇక్కడ రెండో విడతలోనే పోలింగ్ జరగాల్సింది. బీఎస్పీ అభ్యర్థి మృతితో మూడో విడతకు వాయిదా వేశారు)

భోపాల్

వివాదాస్పద బీజేపీ నాయకురాలు సాధ్వీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్‌కు ఇక్కడి సిట్టింగ్ ఎంపీ. 2019లో మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్‌ను ఆమె ఏకంగా 3.64 లక్షల ఓట్ల ఆధిక్యంతో మట్టి కరిపించి సంచలనం సృష్టించారు. అయినా వివాదాస్పదురాలిగా పేరుపడ్డ సాధ్వికి బీజేపీ ఈసారి టికెటివ్వకపోవడం విశేషం! భోపాల్ 1989 నుంచీ బీజేపీ కంచుకోటగా కొనసాగుతోంది. 1999లో మధ్యప్రదేశ్ మాజీ సీఎం ఉమా భారతి ఇక్కడ గెలిచారు. 2004, 2009ల్లో కైలాష్ చంద్రజోషి విజయం సొంతం చేసుకున్నారు. ఇలా అభ్యర్థులు మారుతున్నా బీజేపీనే ఓటర్లు దీవిస్తున్నారు. ఈసారి ఆ పార్టీ నుంచి అలోక్ శర్మ, కాంగ్రెస్ నుంచి అరుణ్ శ్రీవాస్తవ్ బరిలో ఉన్నారు.

మొరేనా

ఇక్కడ 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ నేత రామ్‌నివాస్ రావత్‌ను బీజేపీ అభ్యర్థి నరేంద్రసింగ్ తోమర్ 1.13 లక్షల ఓట్ల వ్యత్యాసంతో ఓడించారు. తోమర్ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గడంతో ఈ స్థానం ఖాళీగా ఉంది. బీజేపీ నుంచి శివమంగళ్ సింగ్ తోమర్, కాంగ్రెస్ నుంచి సత్యపాల్ సింగ్ సికర్‌వార్ పోటీ చేస్తున్నారు. 1996 నుంచి ఇక్కడ బీజేపీదే విజయం. 1996, 1998, 1999, 2004ల్లో అశోక్ అర్గల్, 2009లో నరేంద్రసింగ్ తోమర్ గెలిచారు. ఇది సురక్షిత స్థావరమనే ధీమాతో ఇప్పటిదాకా పెద్ద ఎన్నికలను ఎదుర్కోని శివమంగళ్‌ను బీజేపీ పోటీకి పెట్టింది. ఇక్కడ అభ్యర్థిని మార్చడం ఆ పార్టీకి ఇది వరుసగా మూడోసారి! కాంగ్రెస్ అభ్యర్థి సికర్‌వార్ మాజీ బీజేపీ నేతే. మొరేనాలో బ్రాహ్మణ, రాజ్‌పుత్ ఓట్లు రెండేసి లక్షల చొప్పున ఉన్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ సీట్లకు కాంగ్రెస్ ఏకంగా ఐదింట్లో గెలవడంతో ఈసారి ఫలితంపై ఆసక్తి పెరిగింది.

గుణ

ఇది సింధియాల కోట. మూడో విడతలో దేశవ్యాప్తంగా బాగా ఆసక్తి నెలకొన్న స్థానాల్లో ఒకటి. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా 2002 నుంచి 2019 దాకా ఈ స్థానానికి కాంగ్రెస్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. మారిన రాజకీయ పరిణామాల్లో ఇప్పుడు బీజేపీ తరఫున బరిలో ఉన్నారు. ఆయనతో కాంగ్రెస్ నేత రావు యాదవేంద్రసింగ్ యాదవ్ పోటీ పడుతున్నారు. 2019లో ఇక్కడ బీజేపీ నేత కృష్ణపాల్ సింగ్ యాదవ్ చేతిలో జ్యోతిరాదిత్య ఓటమి చవిచూశారు! 1957లో ఇక్కడ జ్యోతిరాదిత్య నానమ్మ విజయరాజే సింధియా గెలిచారు. 1971లో ఆమె కుమారుడు, జ్యోతిరాదిత్య తండ్రి దివంగత మాధవ్‌రావు సింధియా భారతీయ జన్‌సంఘ్ తరఫున ఇక్కడ నెగ్గారు.

భిండ్

చంబల్ ప్రాంతంలో ఉన్న ఈ స్థానంలో ఆది నుంచి బీజేపీదే ఆధిపత్యం. 2008లో ఎస్సీలకు రిజర్వ్ అయిన తర్వాత కూడా వరుసగా మూడు ఎన్నికల్లోనూ ఆ పార్టీయే గెలిచింది. కాంగ్రెస్ నుంచి ఫూల్‌సింగ్ బారియా, బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ సంధ్యా రాయ్ పోటీలో ఉన్నారు. ఇక్కడ 1971లో విజయరాజె సింధియా కాంగ్రెస్ నుంచి నెగ్గారు. భిండ్‌లో కూడా బ్రాహ్మణ, క్షత్రియ ఓట్లు కలిపి ఆరు లక్షలకు పైనే ఉన్నాయి.

విస్తృత ప్రచారం

మధ్యప్రదేశ్‌లో మూడో విడత స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. రెండు పార్టీల అగ్ర నేతలు కూడా ఇప్పటికే సుడిగాలి పర్యటనలు నిర్వహించారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ, సోదరి ప్రియాంక పలు బహిరంగ సభల్లో పాల్గొన్నారు. తన తండ్రి రాజీవ్ గాంధీ దేశం కోసం బలిదానం చేశారంటూ మొరేనాలో ప్రియాంక భావోద్వేగపూరితంగా మాట్లాడారు. బీజేపీ నుంచి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు నడ్డా మొరేనా, బేతూల్, రాజ్‌గఢ్‌ల్లో జోరుగా ప్రచారం నిర్వహించారు. కులం, నిరుద్యోగం, పేదరికం, వలసలు మూడో విడత స్థానాల్లో బాగా ప్రభావం చూపే అంశాలు.

ఎన్నికల రంగోళి!

ఎన్నికల్లో ఓటింగ్ పెంచేందుకు ఎన్నికల సంఘం ఎన్నో వినూత్నమైన చర్యలు చేపడుతోంది. అహ్మదాబాద్ ఎన్నికల అధికారులు కొంచెం భిన్నంగా ఆలోచించారు. 'మీ విలువైన ఓటుతో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి' అన్న పిలుపు కంటే ఓటు ప్రాధాన్యతను కళాత్మకంగా చెబితే మనసులో బాగా నాటుకుంటుందని భావించారు. స్థానిక అల్ఫా వన్ మాల్ ఆవరణలో ఏకంగా 12 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవుతో ఓటుపై అవగాహన కల్పించే రంగోళీ రూపొందించారు. ఇందుకు 350 కిలోల రంగులు వినియోగించారు. 18 గంటల సమయం పట్టిందట. ప్రజలను ఓటు దిశగా ప్రోత్సహించి, అహ్మదాబాద్‌ను అత్యధిక ఓటింగ్ నమోదైన ప్రాంతంగా చేయడమే తమ ఉద్దేశమని నోడల్ ఆఫీసర్ యోగేశ్ పరేఖ్ అంటున్నారు. మాల్‌కు వచ్చిన ప్రతి ఒక్కరినీ ఈ ఆర్ట్ తెగ ఆకర్షిస్తోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్





శాంభవీ చౌదరి.. యంగెస్ట్ క్యాండిడేట్!

బిహార్‌లోని సమస్తిపూర్ నుంచి ఎల్‌జేపీ అభ్యర్థిగా లోక్‌సభ బరిలో

శాంభవీ చౌదరి. ఈ లోక్‌సభ ఎన్నికల బరిలో ఉన్నవారిలో అత్యంత చిన్నవయస్కురాలు. 25 ఏళ్ల శాంభవి బిహార్ మంత్రి అశోక్ చౌదరి కుమార్తె. లేడీ శ్రీరామ్ కాలేజీలో డిగ్రీ, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో మాస్టర్స్ చేశారు. బిహార్‌లోని మగధ్ వర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నారు. చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) అభ్యర్థిగా సమస్తిపూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు.

రాజకీయ కుటుంబంలో పుట్టిపెరగడంతో శాంభవికి సహజంగానే రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. తొలుత చదువుకే ప్రాధాన్యమిచ్చారు. బిహార్‌లో దేవాలయాల్లో దళిత పూజారులను నియమించిన మాజీ ఐపీఎస్ అధికారి ఆచార్య కిషోర్ కునాల్ కుమారుడు సాయన్ కునాల్‌ను పెళ్లాడారు. అత్తగారి ఊరైన సమస్తిపూర్ నుంచి లోక్‌సభ బరిలో ఉన్నారు. పైగా తండ్రి పార్టీ అయిన జేడీ(యూ)ను కాదని చిరాగ్ పార్టీలో చేరడం విశేషం! అది తన సొంత రాజకీయ నిర్ణయం అంటారామె. బిహార్‌కు, బిహారీలకు తొలి ప్రాధాన్యమిచ్చే చిరాగ్ విజన్ నచ్చి ఎల్‌జేపీలో చేరానంటారు. ''చిరాగ్ భయ్యా విజన్‌కు ఆకర్షితురాలినయ్యాను. ఎందుకంటే నేను ఢిల్లీ వర్సిటీలో చదివేటప్పుడు 'మీరు బీహారీలా కనిపించడం లే'దని ప్రొఫెసర్లు అనేవారు. బిహారీలా కనిపించకపోవడం, దళితురాలిగా కనిపించకపోవడం ఏమిటా అని ఎప్పుడూ ఆలోచించేదాన్ని. అది నాపై తీవ్ర ప్రభావం చూపింది'' అంటారు శాంభవి. ''సమస్తిపూర్‌లో విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పన నా తొలి ప్రాథమ్యాలు. వచ్చే ఐదేళ్లలో రాబోయే తరాల కోసం సరికొత్త సమస్తిపూర్‌ను అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నా'' అని వివరించారు. కాంగ్రెస్‌తో స్థానికంగా యాదవ, ముస్లిం, ఓబీసీ ఓటు బ్యాంకు అధికంగా ఉన్నా తన ఎస్సీ నేపథ్యం, భర్త ఓబీసీ నేపథ్యం కలిసొస్తాయని ధీమాతో ఉన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

తొలి రెండు దశల్లోనూ...

తగ్గిన మహిళా ఓటింగ్

పురుషులతో పోలిస్తే పలు రాష్ట్రాల్లో భారీ అంతరం

మహిళలు ఆకాశంలో సగం. అవకాశాల్లో అంతకంటే ఎక్కువే. అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానం. ఓటర్లపరంగా చూస్తే పలు రాష్ట్రాల్లో పురుషుల కంటే ఎక్కువే. అందుకే పార్టీలన్నీ తమ మేనిఫెస్టోల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్నాయి. చాలా రాష్ట్రాల్లో మహిళల కోసం ప్రత్యేక పథకాలు పుట్టుకొస్తున్నాయి. కర్నాటకలో, తాజాగా తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల జయాపజయాల్ని నిర్దేశించింది ఈ మహిళా పథకాలే! అయితే ఎందుకో గానీ ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మహిళల్లో 'ఓటు ఉత్సాహం' లోపిస్తోంది. ఇప్పటిదాకా జరిగిన రెండు విడతల పోలింగ్‌లో మహిళల ఓటింగ్ శాతం తగ్గినట్టు కేంద్ర ఎన్నికల సంఘం తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇది మంచి పరిణామం కాదంటున్నారు విశ్లేషకులు...

– సాక్షి, నేషనల్ డెస్క్



లోక్‌సభ ఎన్నికల తొలి రెండు విడతల పోలింగ్‌ను పరిశీలిస్తే దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో మహిళల ఓటింగ్ శాతంలో తగ్గుదల నమోదైంది. 2019తో పోల్చి చూసినప్పుడు 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటి దాకా రెండు విడతల్లో ఓటు వేసిన మహిళల శాతం 0.8 శాతం మేర తగ్గింది. 2019లో తొలి రెండు విడతలతో పోలిస్తే ఈసారి మొత్తమ్మీద (స్త్రీ, పురుషులు) 3.3 శాతం దాకా తక్కువ ఓటింగ్ నమోదైంది. ఈ ఏడాది తొలి విడతలో దశలో 66.14 శాతం, రెండో విడతలో 66.71 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019లో మొదటి దశలో 69.4 శాతం, రెండో దశలో 69.6 శాతం ఓటింగ్ నమోదైంది.

ఇక్కడ దయనీయం

గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే నాగాలాండ్ లోక్‌సభ స్థానంలో ఈసారి రికార్డు స్థాయిలో మహిళల ఓటింగ్ ఏకంగా 24.79 శాతం తగ్గిపోయింది! మొత్తమ్మీద కూడా అక్కడ చాలా తక్కువ ఓటింగ్ నమోదైంది. మహిళల ఓటింగ్ సిద్ధీ లోక్‌సభ స్థానంలో 13 శాతం, మథురలో 13 శాతం, రేవా, పథనంతిట్టల్లో 12 శాతం, ముజఫర్‌నగర్, ఖజురహోల్లో 11 శాతం తగ్గింది. కొట్టాయం, ఇడుక్కి, రాంపూర్, సత్నా, భాగ్‌పత్‌ల్లో 10 శాతం, వయనాడ్‌లో 7 శాతం, బెంగళూరు రూరల్‌లో 7 శాతం, ఔరంగాబాద్‌లో 5 శాతం, ఝుంఝునూలో 9 శాతం, షిల్లాంగ్‌లో 8 శాతం చొప్పున మహిళల ఓటింగ్ తగ్గింది. మొత్తం మీద చూస్తే 14 లోక్‌సభ స్థానాల్లో 10 నంచి 20 శాతం మధ్య, 59 చోట్ల 5–10 శాతం, 80 చోట్ల 0–5 శాతం ఓటింగ్ తగ్గిపోయింది. ఛత్తీస్‌గఢ్, కర్నాటక, త్రిపుర, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, అండమాన్ నికోబార్, రాజస్థాన్, మిజోరం, యూపీల్లో మహిళల ఓటింగ్ బాగా తగ్గడం ఆందోళన కలిగిస్తోంది.

ఇక్కడ నయం

రెండు దశల్లో ఎన్నికలకు వెళ్లిన నియోజకవర్గాల్లో 34 చోట్ల మాత్రం మహిళల ఓటింగ్ 0–5 శాతం మధ్య పెరిగింది. ఒక స్థానంలో ఇది మరింత ఎక్కువగా నమోదైంది. లక్షద్వీప్, అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర స్థానాల్లో 80 శాతం మహిళలు ఉత్సాహంగా ఓటు వేయడం ప్రోత్సాహనీయం. బీహార్, ఉత్తరాఖండ్, జమ్మూ కశ్మీర్, తమిళనాడు, కేరళ, మేఘాలయ, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లోనూ, పుదుచ్చేరిలోనూ పురుషులతో పోలిస్తే మహిళలే ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల తొలి రెండు దశల్లో రాష్ట్రాలవారీగా పోలింగ్ శాతం

రాష్ట్రం/యూటీ	మహిళల ఓటింగ్	పురుషుల ఓటింగ్
లక్షద్వీప్	85.5	82.9
త్రిపుర	80.6	81.3
సిక్కిం	79.8	79.9
అసోం	79.6	79
పుదుచ్చేరి	79.1	78.6
పశ్చిమబెంగాల్	80.3	78.3
మణిపూర్	79	77.9
అరుణాచల్‌ప్రదేశ్	80.6	76.3
మేఘాలయ	79.7	75.4
ఛత్తీస్‌గఢ్	73.5	75
కర్నాటక	71.1	71.5
కేరళ	71.7	70.6
తమిళనాడు	70.2	69.8
జమ్మూకశ్మీర్	71	69.6
మహారాష్ట్ర	60.7	65.9
మధ్యప్రదేశ్	61.3	65.3
అండమాన్	63.8	64.4
రాజస్థాన్	60.5	62.2
ఉత్తరప్రదేశ్	56.7	56.9
మిజోరం	55.7	58.1
నాగాలాండ్	57.9	57.5
ఉత్తరాఖండ్	58	54.5
బిహార్	56	53.2

ప్రస్తుత ఎన్నికల వరకే చూస్తే మొత్తం మీద స్త్రీ పురుషుల ఓటింగ్ మధ్య పెద్ద వ్యత్యాసం కనిపించడం లేదు. తొలి విడతలో మహిళల ఓటింగ్ 66.1 శాతం, పురుషుల ఓటింగ్ 66.2 శాతం నమోదైంది. రెండో విడతలో 66.4, 67 శాతంగా ఉంది. రాష్ట్రాలవారీగా చూస్తే మాత్రం తేడా బాగానే ఉంది.

మంచి పరిణామం కాదు

మహిళలు మరింతగా ముందుకొచ్చి ఓటు వేస్తేనే నేతలకు, పార్టీలకు, ప్రభుత్వాలకు స్పష్టమైన సందేశం సాధ్యమని విశ్లేషకులు అంటున్నారు. మిగతా ఐదు విడతల పోలింగ్‌లోనూ మహిళల అనాసక్తి ఇలాగే కొనసాగితే అది ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయవచ్చన్న అభిప్రాయం వినిపిస్తోంది. మహిళా ఓటర్ల మనసు గెలిచేందుకు పార్టీలు మరింత కృషి చేయాల్సిన అవసరాన్ని ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయన్న అభిప్రాయమూ ఉంది.

సంయుక్త... మంత్రిగారి అమ్మాయి

పుస్తకాల పురుగు



పరిచయం

సంయుక్తా పాటిల్. మంచి ఫుడీ. అంతకు మించి పుస్తకాల పురుగు. మంచి పుస్తకం దొరికిందంటే దాన్ని పూర్తి చేసేవరకు నిద్ర పోరు. బసవేశ్వరుని భక్తురాలు. కర్నాటక వ్యవసాయ మంత్రి శివానంద్ పాటిల్ కూతురైన సంయుక్త బీజాపూర్ గ్రామీణ మహిళల సాధికారత కోసం కృషి చేస్తున్నారు. జిల్లా కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్‌గా వారి ఆర్థిక స్వావలంబన కోసం పాటుపడుతున్నారు. బాగల్‌కోట్ నుంచి తొలిసారిగా లోక్‌సభ ఎన్నికల బరిలో దిగారు. నాలుగు సార్లు ఎంపీగా గెలిచిన బీజేపీ సీనియర్ నేత పీసీ గద్దె గౌడర్‌తో కాంగ్రెస్ తరఫున తలపడుతున్నారు...

– సాక్షి, నేషనల్ డెస్క్

క్షేత్రస్థాయిలో..

30 ఏళ్ల సంయుక్త క్రైస్ట్ యూనివర్సిటీ లా స్కూల్లో న్యాయ శాస్త్రం చదివారు. తండ్రి రాజకీయాలను చూస్తూ ఎదిగారు. విద్యార్థిగా ఎన్ఎస్‌యూఐలో పని చేశారు. యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా అత్యధిక ఓట్లతో గెలిచారు. మహిళా కాంగ్రెస్ నాయకురాలిగా ప్రజల మనసులను గెలుచుకున్నారు. అధికారం ఉన్నా, లేకున్నా ప్రజలతో మమేకమై ఉండాలన్న పాఠాన్ని తండ్రి నుంచి నేర్చుకున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల సంక్షేమానికి పని చేయాలన్న తండ్రి సూచన మేరకు 2017లో స్పర్శ్ ఫౌండేషన్ ప్రారంభించారు. ఇది గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత కోసం పనిచేస్తుంది. పాలసీలు సమాజంలోని అట్టడుగు వ్యక్తులకు చేరినప్పుడే అవి విజయం సాధించినట్లని సంయుక్త నమ్ముతారు. సాయంకాలాల్లో గ్రామాల్లోని ప్రజలను కలవడానికే ఇష్టపడతారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బసవనబాగేవాడి నియోజకవర్గంలో తండ్రి ప్రచారమంతా తానై నిర్వహించారు. అయితే ఎన్నికల ప్లానింగ్ ఒకెత్తు. నేరుగా పోటీ చేయడం మరో ఎత్తు. విద్యార్థి, యువజన సంఘాల ఎన్నికల అనుభవం తనకిప్పుడు ఉపయోగపడుతుందంటారామె. కొత్త పరిశ్రమలు, పర్యాటకాభివృద్ధి, బాగల్‌కోట్–కుడచి పెండింగ్ రైల్వే లైన్ పరిపూర్తి, నియోజకవర్గ సమగ్రాభివృద్ధి ప్రధాన ఎజెండాగా పెట్టుకున్నారు. వ్యవసాయాధారిత బాగల్‌కోట్ ప్రాంతం రెండు కరువులను ఎదుర్కొంది. ''అందుకే నీటి పారుదలపై దృష్టి పెడతా. ప్రజల గొంతుకగా మారతా'' అంటున్నారు.

బీజేపీకి గట్టి సమాధానం..

వారసత్వ రాజకీయాలపై బీజేపీ విమర్శలను సంయుక్త తేలిగ్గా తీసిపారేస్తారు. ''తల్లిదండ్రుల నేపథ్యం వల్ల రాజకీయాల్లోకి ఎంట్రీ సులభం అవుతుంది. కానీ చివరికి ప్రజలే నిర్ణేతలు. వాళ్లు అంగీకరించకపోతే ఎంతటి నేతల పిల్లలయినా రాజకీయాల్లో రాణించలేరు'' అన్నది ఆమె వాదన. ''దేశంలోని 65 శాతం మంది ఓటర్లు 40 ఏళ్ల లోపువారే. 50 శాతం 25 ఏళ్ల లోపువారే. కానీ 40 ఏళ్ల లోపున్న పార్లమెంటేరియన్లు మాత్రం కేవలం 12 శాతం. యువత ప్రజాప్రతినిధుల సంఖ్య బాగా పెరగాలి'' అంటారు సంయుక్త. ఆమె విజయపుర అసెంబ్లీ నియోజకవర్గవాసి. కనుక బాగల్‌కోట్‌కు బయటి వ్యక్తి అంటూ బీజేపీ విమర్శిస్తోంది. తాను బయటి వ్యక్తినెలా అవుతానని ప్రశ్నిస్తారామె. ''నేను అవిభక్త బీజాపూర్‌లో పుట్టా. ప్రతి ర్యాలీలోనూ నాకు ఘన స్వాగతం లభిస్తోంది. ఏ ఇంటికి వెళ్లినా నా ఇంటికి వెళ్లినట్టే ఉంటుంది'' అంటూ కొట్టిపారేస్తారు. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యంపైనా గళం విప్పుతున్నారు సంయుక్త. రాజకీయాల్లో ఎక్కువ మంది మహిళలుంటే విధాన రూపకల్పనలో మహిళా దృక్పథం వస్తుందన్నది ఆమె వాదన.

ఎనిమిదేళ్లుగా రంజాన్ ఉపవాసాలు...

సంయుక్త 12వ శతాబ్దపు మత, సంఘ సంస్కర్త బసవేశ్వరుని భక్తురాలు. అయితే ఎనిమిదేళ్లుగా రంజాన్ మాసమంతా విధిగా ఉపవాసం (రోజా) పాటిస్తున్నారు. మతమేదైనా విశ్వాసం మంచిదైనప్పుడు ఆచరించడంలో తప్పేముందని ప్రశ్నిస్తారు. ''పెద్దయ్యాక ఏమవుతావని నా చిన్నతనంలో ఎవరడిగినా ప్రధాని అవుతాననేదాన్ని. ఇప్పుడు ఎంపీ అయ్యే అవకాశం వచ్చింది. ఏమో, భవిష్యత్‌లో ప్రధాని కూడా అవుతానేమో!'' అని ఆశాభావం వ్యక్తం చేస్తారు సంయుక్త.